




# కరపత్రం

SINCE 2014

మంగళవారం,డిసెంబర్ 03, 2024 | సంపుటి :0 | సంచిక : 55 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


## ఆరోగ్య ఉత్సవాలకు సీఎం రేవంత్ శ్రీకారం..

# 213 అంబులెన్సులు ప్రారంభం



హైదరాబాద్: ప్రజా పాలన - ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఆరోగ్య ఉత్సవాలకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఎన్టీఆర్ మార్గ్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో 108, 102 వాహనాలకు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. 108 సర్వీసుల కోసం 136 అంబులెన్సులు, 102 సర్వీసుల కోసం 77 అంబులెన్సులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను ఇతర మంత్రులు, నేతలతో కలిసి సీఎం పరిశీలించారు.

అనంతరం ఏర్పాటు చేసిన సభలో 28 పారామెడికల్, 16 నర్సింగ్ కాలేజీలను సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. 33 ట్రాన్స్‌జెండర్ల క్లీనిక్‌లను ప్రారంభించడంతో పాటు 442 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, 24మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లకు నియామక పత్రాలు అందజేశారు. మైత్రి ట్రాన్స్ క్లీనిక్‌లు ప్రతి గురువారం సేవలందించనున్నాయి. కొత్తగా ప్రారంభించిన వాటితో కలిపి రాష్ట్రంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల సంఖ్య 37కి పెరిగింది.

## పార్లమెంట్‌లో 'సబర్మతి రిపోర్ట్'ను వీక్షించనున్న ప్రధాని మోదీ

- ఇటీవల విడుదలైన 'సబర్మతి రిపోర్ట్' సినిమాను పార్లమెంట్‌లో ప్రధాని మోదీ వీక్షించనున్నారు.



గుజరాత్ అల్లర్లు, గోద్రా రైలు దహనకాండను ఆధారంగా చేసుకొని తెరకెక్కిన 'ది సబర్మతి రిపోర్ట్' ను పార్లమెంట్ ప్రాంగణంలో ప్రధాని నరేంద్రమోదీ వీక్షించనున్నారు. సోమవారం సాయంత్రం బాలయోగి ఆడిటోరియంలో ఇతర నేతలతో కలిసి ఈ చిత్రాన్ని చూడనున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

2002లో గుజరాత్‌లో జరిగిన అల్లర్లు, గోద్రా రైలు దహనకాండ దేశాన్ని కలచివేసిన విషయం తెలిసిందే. ఆ ఏడాది ఫిబ్రవరి 27న పంచమహల్ జిల్లాలోని గోద్రా పట్టణంలో సబర్మతి ఎక్స్‌ప్రెస్‌కు కొందరు దుండగులు నిప్పు పెట్టారు. ఈ ఘటనలో 59 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. దీనిని ఆధారంగా చేసుకొని బాలీవుడ్ దర్శకుడు ధీరజ్ సర్నా 'ది సబర్మతి రిపోర్ట్' సినిమాను తెరకెక్కించారు. విక్రాంత్ మాస్సే, రాశీఖన్నా ప్రధాన పాత్రల్లో నటించారు. రిధి డోగ్రా కీలకపాత్ర పోషించారు. నవంబర్ 15న ఇది విడుదలైంది.

ఈనేపథ్యంలో దీనిని ఉద్దేశించి ఒక నెటిజన్ 'ఎక్స్'లో పోస్ట్ పెట్టాడు. ప్రతిఒక్కరూ ఈ చిత్రాన్ని తప్పక చూడాలని పేర్కొన్నాడు.

2లో

## కోకాకోలా కంపెనీని ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

బండతిమ్మాపూర్: సిద్దిపేట జిల్లా బండ తిమ్మాపూర్‌లో రూ.1000 కోట్లతో నిర్మించిన కోకాకోలా కంపెనీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ప్లాంట్‌లో కలియతిరిగారు. కూల్ డ్రింక్ తయారీ వివరాలను అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గజ్వేల్ నియోజకవర్గంలో పర్యటించడం ఇదే తొలిసారి. సీఎం వెంట మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, కొండా సురేఖ ఉన్నారు.

సీఎం పర్యటన సందర్భంగా కంపెనీలోకి కాంగ్రెస్ నేత నర్సారెడ్డిని పోలీసులు అనుమతించకపోవడంతో కార్యకర్తలు ఆందోళనకు దిగడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. కంపెనీ గేటు ధ్వంసం చేసి కార్యకర్తలు లోపలికి దూసుచ్చినట్లు సమాచారం.



## రాష్ట్ర విభజన అంశాలపై ఏపీలో తొలిసారి అధికారుల కీలక భేటీ




రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని విభజన అంశాలపై చర్చించేందుకు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారుల కమిటీ భేటీ అయింది.

అమరావతి: రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని విభజన అంశాలపై చర్చించేందుకు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారుల కమిటీ భేటీ అయింది. ఏపీలో తొలిసారి జరుగుతున్న ఈ భేటీలో ఇరు రాష్ట్రాల సీఎస్‌ల నేతృత్వంలో అధికారుల కమిటీ సమావేశమైంది. విభజన చట్టంలోని 9, 10 షెడ్యూల్‌లో సంస్థల ఆస్తుల పంపకాలపై ప్రధానంగా చర్చించనున్నారు. విద్యుత్ బకాయిలు, ఉమ్మడి సంస్థల ఖర్చులను తిరిగి చెల్లించే అంశంతో పాటు విభజన పూర్తికాని సంస్థలకు చెందిన నగదు నిల్వలపైనా చర్చించనున్నారు. పంపకం కాకుండా మిగిలిపోయిన రూ.8వేల కోట్ల అంశంపై చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ఈ ఏడాది జులై 5న తెలుగు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని ప్రజా భవన్ వేదికగా భేటీ అయిన విషయం తెలిసిందే. ఆ భేటీకి కొనసాగింపుగా ఇరు రాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. ఈ కీలక భేటీలో ఏపీ నుంచి సీఎస్, ఆర్థిక శాఖ కార్యదర్శి, హోంశాఖ కార్యదర్శి, ఎక్సైజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి, జెన్‌కో సీఎండీ, వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ హాజరు కాగా.. తెలంగాణ నుంచి సీఎస్, ఆర్థిక, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు తదితరులు హాజరయ్యారు.

## మహబూబ్‌నగర్ జిల్లాలో పోలీస్ యాక్ట్

ఈనెల 30 వరకు అమలు

జిల్లా ఎస్పీ డీ. జానకి వెల్లడి




2లో

మహబూబ్‌నగర్ జిల్లాలో పోలీసులు ఆంక్షలు విధించింది. శాంతి భద్రతల దృష్ట్యా జిల్లా అంతటా పోలీస్ యాక్ట్ 30ని అమలు చేస్తున్నారు. సోమవారం (డిసెంబర్ 2) నుంచి జనవరి 1 వరకు జిల్లా అంత ఆమలులో ఉండనున్నాయి. ఈ మేరకు జిల్లా ఎస్పీ డీ. జానకి వెల్లడించారు. ముందస్తు అనుమతి లేకుండా జిల్లాలో ఎలాంటి బహిరంగ సమావేశాలు కానీ, ఊరేగింపులు,


## భారాస సినిమాకు శుభం కార్డు పడిపోయింది: ఆది శ్రీనివాస్



హైదరాబాద్: బతుకమ్మ చీరల పేరిట గత ప్రభుత్వం నేతన్నల జీవితాలను ఆగం చేసిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. సూరత్ నుంచి తెచ్చి బతుకమ్మ చీరలు ఇచ్చారని ఆరోపించారు. అవి పంట చేలలో బెదురు పెట్టేందుకు ఉపయోగపడ్డాయి తప్ప.. ధరించేందుకు పనికిరాలేదని మండిపడ్డారు. క్యాబినెట్‌లో మహిళకు స్థానం కల్పించని చరిత్ర భారాస సర్కారుదని విమర్శించారు. హైదరాబాద్ సీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "బతుకమ్మ చీరలను అసలు మహిళలు కట్టుకున్నారా? ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వని పాలన భారాస సర్కారుది. గ్రూప్ వన్ పేపర్లను లీక్ చేసిన చరిత్ర గత ప్రభుత్వానిది. భారాస సినిమాకు శుభం కార్డు పడిపోయింది. సమగ్ర సర్వే చేయించి ఆ నివేదికలను అటకెక్కించారు. బీసీలకు భారాస అనుకూలమా? కాదా? తేల్చి చెప్పాలి. జనాభా దామాషా పద్ధతిలో అన్ని వర్గాలకు ఫలితాలు దక్కాల్సిందే. హైదరాబాద్‌ను కాపాడాలనే ఉద్దేశంతోనే హైడ్రాను తీసుకొచ్చాం. దానికి కూడా తూట్లు పొడిచేందుకు ప్రయత్నిస్తున్నారు" అని ఆది శ్రీనివాస్ విమర్శించారు.

# మాట మార్చడంతో

# సీఎం రేవంత్‌రెడ్డి పీహెచ్‌డీ



- ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా.. ఇప్పుడు ఒకలా రేవంత్
- రెండు నాల్కల ఆణిముత్యాల విడుదల
- రైతుబంధు ఇస్తామని ఎగ్గొట్టాడు : మాజీ మంత్రి హరీశ్‌రావు

పూటకో మాట మాట్లాడడం.. మాట మార్చడంలో సీఎం రేవంత్ రెడ్డి పీహెచ్‌డీ పూర్తి చేశారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సెటైర్లు వేశారు. రేవంత్ ఏడాది పాలన పూర్తవుతున్న సందర్భంగా రేవంత్ రెండు నాల్కల ఆణిముత్యాలను తెలంగాణ భవన్ వేదికగా హరీశ్‌రావు విడుదల చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రైతుబంధు, బతుకమ్మ చీరలు, ఎల్‌ఆర్‌ఎస్, పోటీ పరీక్షల వాయిదా, కులగణన సర్వే, కూల్చివేతలు, ఏక్ పోలీసు,

2లో

## వాజేడు ఎస్ఐ హరీశ్ ఆత్మహత్య



2లో

- ములుగు జిల్లా వాజేడు ఎస్ఐ హరీశ్ ఆత్మహత్య చేసుకున్నారు.
- ముళ్లకట్ట సమీపంలోని హరిత రిసార్ట్స్‌లో తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు.

వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తున్నది. అయితే ఏటూరునాగారంలో ఎన్‌కౌంటర్ జరిగిన రాత్రే ఆయన సూసైడ్ చేసుకోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనా స్థలానికి చేరుకున్న ఉన్నత అధికారులు దర్యాప్తు చేపట్టారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం,డిసెంబర్ 03, 2024

## సంపాదకీయం

### "ప్రక్రియ కంటే కవిత్వగుణం ముఖ్యం!"

కవిగా, రచయితగా, విమర్శకునిగా, పరిశోధక సేవకునిగా, రాజమండ్రి గౌతమీ గ్రంథాలయం గ్రంథభాండారిగా, ఆత్మీయ స్నేహపరిమళాల్ని పంచిన గంధహృదయునిగా వైవిధ్య పాత్రల సమ్మేళనంతో సన్నిధానం నరసింహశర్మ గారి జీవనప్రస్థానం సాగుతోంది.

పశ్చిమ గోదావరి జిల్లా కుమారదేవంలో 1945 డిసెంబర్ 7న ఆయన జన్మించారు. గౌతమీ గ్రంథాలయంలో నాలుగు దశాబ్దాల పాటు వివిధ హోదాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారు. లెక్కకుమిక్కిలి పరిశోధకులకు గ్రంథాలయ సేవలు అందించారు. 'అతడె గౌతమి, గౌతమి అతడు' అని అద్దేపల్లి రామ్మోహనరావు గారు ప్రస్తుతించేంతగా ఆయన ఆ లైబ్రరీతో మమేకమయ్యారు.

సన్నిధానం 'ప్రాణహిత', 'బ్రౌను ఉదాహరణం' కావ్యాల కర్త. 'పాతూరి నాగభూషణం జీవిత చరిత్ర', మధునాపంతుల సత్య నారాయణ శాస్త్రిపై 'మధుస్మృతి', కేంద్ర సాహిత్య అకాడమీ భార తీయ సాహిత్య నిర్మాతలు పరంపరలో 'నేదునూరి గంగాధరం' మోనోగ్రాఫ్ రాశారు. 'ప్రమేయ ఝరి' ఆయన సాహిత్య వ్యాస సంపుటి. ఆరుద్ర, చలసాని ప్రసాద్ తనకి రాసిన లేఖల్ని పుస్తకాలుగా ప్రచురించారు. తెలుగు భాషలో అచ్చు అయిన మొదటి గ్రంథం 'నూరు జ్ఞానవచనాలు' (1747) పునర్ముద్రిం చారు. 'కాశ్మీర్ కీ లోక్ కథాయే', 'పంజాబ్ కీ లోక్ కథాయే', 'నల దమయంతి' హిందీ గ్రంథాలను తెలుగులోకి అనువదించారు.

వాడ్రేవు చినవీరభద్రుడు గారు ఒకచోట రాసినట్టుగా ఆయన 'ఎందరో మహాకవుల పద్యాలకు పల్లకిగా జీవిస్తున్న మనిషి.' పండిత శ్రేణికి ఆధునిక కవులకి వారధి వంటి సన్నిధానం ఈ ఏడాది డిసెంబర్ ఏడున ఎనభయ్యో సంవత్సరంలో అడుగిడ నున్నారు. ఆ సందర్భంగా ఆయనతో సంభాషణ.

ఇంటర్వ్యూ : నామాడి శ్రీధర్, ఒమ్మి రమేష్ బాబు

సాహిత్యంతో మీకు ఏ వయస్సులో స్నేహం కుదిరింది? అది ఎలా వర్ధిల్లుతోంది?

నా 17వ ఏట అంటే 1962లో దేశభక్తి కవిత్వంగా కొన్ని కంద పద్యాల్ని రాశాను. కేవల పద్యనిర్మాణ సౌందర్యం నుండి నూతన భావభవనంలో ప్రవేశించడానికి కొంత కాలం పట్టింది. పద్యాలు కాక పద్య కవిత్వాలు రాయాలని తెలిసింది. క్రమంగా ఓ వైపు పత్రికల్లో వ్యాసాలు, మరో వైపు పుస్తక రచన సాగాయి. తొలి నాళ్ళలో శ్రీశ్రీ, సి.నా.రె ప్రభావం పడింది. నేదునూరి గంగాధరం, మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి, మల్లంపల్లి శరభయ్య ప్రోత్స హించారు. కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ, జయధీర్ తిరుమలరావు, సతీష్ చందర్ల స్నేహ పరిమళాలు ఆఘ్రాణించాను. పరిశోధక వ్యాసాలు రాయడంతోపాటు పరిశోధక సమాచార సేవలు చేయడం, గౌతమీ జ్ఞాన ప్రవాహవేగంలో నిత్యం పునీత మయ్యాను.

రాజమండ్రి సాహిత్య వాతావరణం ప్రత్యేకతలు ఏమిటి?

విభిన్న సాహిత్యాభిప్రాయాలు, భావవైవిధ్యాలూ ఉన్నప్పటికీ ఒక సహజీవన వాతావరణం కొనసాగడం గొప్ప స్థాయి గల అంశం. వైయక్తిక శత్రుత్వం లేకుండా భాషా సాహి త్యాల భావతీవ్రతలు, చర్చలూ ఉండడం రాజమండ్రి ప్రత్యేకత. సాహిత్య విషయాల గురించి సీరియస్‌గా పట్టించుకుని కోర్టులకి వెళ్ళడం మామూలు సంగతి కాదు. సాహిత్య ఆలోచనా వైవిధ్యాలు మానవ విరోధాలు కాకపోవడం ఎంతో ఆహ్వానించదగ్గ విషయం!

ప్రాచీన సాహిత్యం, ఆధునిక సాహిత్యం ఈ విభాగాలపై మీ ప్రాధాన్యాలు, అభిప్రాయాలు ఎటువంటివి?

ప్రాచీన సాహిత్యం అది ఉద్భవించిన నాటికి ఆధునిక సాహిత్యంబీ ఆధునిక సాహిత్యం అది వచ్చిన తర్వాత కాలానికి ప్రాచీన సాహిత్యం. ఇవి కాల సంబంధి తాలైనప్పుడు రెండిటికీ సమ ప్రాధాన్యం ఇవ్వాలి. కిటికీలు తెరచుకునే ఉండాలి. అన్నిటినీ అధ్యయనం చేసి మన సంపద ఇంతటిదా అని గర్వించగలగాలి.

పద్య కవిత్వం, వచన కవిత్వం – ఈ ప్రక్రియలపై మీకు నిర్దిష్టమైన అభిప్రా యాలు ఏమైనా ఉన్నాయా?

ఫలానా ప్రక్రియ నాదే అని కానీ మాదే అని కానీ అనుకోవడం సరైనది కాదు. ఒక్కొక్కళ్ళకీ ఒక్కొక్క ప్రక్రియా ప్రావీణ్యం ఉంటుంది. కాలాన్ని బట్టి, చదువుల్ని బట్టి కొన్ని ప్రక్రియలు సన్నిహితం అవుతాయి. అయితే నేడున్నది వచన కవితాయుగం అనడానికి సందేహం లేదు. సాహిత్య ప్రక్రియా స్వాతంత్ర్యం రచయితల జన్మహక్కుల్లాంటివి.

పండిత శ్రేణికి ఆధునిక కవులకి పొసగని కాలంలో మీరు ఇరుపక్షాలు మెచ్చే వారధి ఎలా అయ్యారు?

పద్యమంటే ఆధునిక కవులకి గిట్టదు. వచన కవిత్వమంటే పండిత శ్రేణికి పొసగదు. పద్యానికి వేయి ఏళ్ళ చరిత్ర ఉంది. వచన కవిత్వం కొన్ని ఏళ్ళ లోనే చరిత్ర సృష్టించుకుంది. ఆధునిక కవులు కాలానుగుణంగా, భావానుగుణంగా ప్రక్రియల్ని ఉప యోగించుకున్నారు. నిజానికి ప్రక్రియల మధ్య వైరం లేదు. పద్యం చచ్చిపోవాలని కోరుకోకూడదు. ఈ కాలానికి, ఈ చదువులకి, ఈ వర్తమాన భావజాలాలకూ పద్యం ప్రక్రియ సరిపోదని భావించేవారిని తప్పుపట్టకూడదు. ప్రక్రియను ఎన్నుకోవడం కవి స్వాతంత్ర్యానికి సంబంధించిన అంశం. అనుభూతి, నూతన భావన, వర్ణన, వ్యక్తీకరణలో కొత్తదనం తదితర కవిత్వగుణాల వల్ల కవిత్వాలు బతికి బట్టకడతాయి కాని ప్రక్రియల వల్లనే బతకవు. నా నవ్య భావావిష్కరణ ప్రయత్నాల వల్లనే ఇరుపక్షాలకీ వారధి అయ్యాను.

గౌతమీ గ్రంథాలయానికి వచ్చిన పరిశోధకుల్లో ప్రసిద్ధులు ఎవరు, వారి పరిశోధనా వైశిష్ట్యాల గురించి చెప్పండి?

సి.నా.రె మాకందాలు రాసే ముందు కొక్కొండ వారి బిల్వేశ్వరీయం జిరాక్స్ ప్రతిని నా ద్వారా తెప్పించుకుని చదివారు. కె.వి.ఆర్ పత్రికారంగంలో వివిధ కులాల పత్రికల్ని అధ్యయనం చేశారు. ఆరుద్ర గౌతమీ గ్రంథాలయంలోని పాత పత్రికల్లో మరెక్కడా లేనివేమిటో చెప్పారు. బంగోరె ప్రాచీన గ్రంథాల ముఖపత్రాల పరిణామాల్ని తెలిపారు. దుమ్ము పట్టిన ఇరుకు గదిలో ఫ్యాన్ లేక ఊపిరి సలపని వాతావరణంలో చలసాని ప్రసాద్ చొక్కా తీసి ఒక బీరువా కొక్కెంకి పెట్టి శరీరంపై చెమటలు కమ్మిన అసౌకర్యంలో నేలమీద కూర్చుని పాత పత్రికల్లో శ్రీశ్రీని, కొడవటిగంటిని శోధించుకునే దృశ్యం మరచిపోలేనిది. జయధీర్ తిరుమలరావు తెలుగులో నిషేధ సాహిత్యంపై గొప్ప పరిశోధన చేశారు. జర్మనీ కొలోన్ విశ్వవిద్యాలయం నుండి మరియా మీస్ అనే పరిశోధకురాలు వచ్చారు. భారతీయ గ్రామీణ మహిళల మీద, పాలకొల్లు లేసు పరిశ్రమ మీద ఆమె పరిశోధన చేశారు.

గ్రంథాలయోద్యమం అనేది నిరంతరం సాగే ఉద్యమం కదా! ఇప్పటి పరిస్థితులు ఎలా ఉన్నాయి?

ప్రభుత్వ గ్రంథాలయాలుబీ గ్రంథాలయ సంస్థల శాఖా గ్రంథాలయాలుబీ కళాశాల, విశ్వవిద్యాలయ గ్రంథాలయాలుబీ ప్రయివేటు గ్రంథాలయాలు ఉన్నాయి.


# మాట మార్చడంతో సీఎం రేవంత్‌రెడ్డి పీహెచ్‌డీ

మొదటిపేజీ తరువాయి

మద్యం అమ్మకాలు, కాళేశ్వరం ప్రాజెక్టు, సోనియా గాంధీ బలిదేవత, పార్టీ ఫిరాయింపులు, శిలాఫలకాలు, పేపర్ యాడ్స్, మూసీ అభివృద్ధి, అడ్వైజర్లకు కేబినెట్ హోదా, యూట్యూబ్ చానెల్స్, ప్రజాస్వామ్య పునరుద్ధరణ, బూటకపు ఎన్‌కౌంటర్లపై రేవంత్ రెడ్డి మాట్లాడిన డబుల్ స్టాండర్డ్స్‌ను హరీశ్‌రావు వీడియో ఆధారాలతో ప్రజలకు చూపించారు. పై అంశాలపై ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏం మాట్లాడిండు.. అధికారంలోకి వచ్చాక ఏం మాట్లాడిండు అనే విషయాలను కళ్లకు కట్టినట్లు తెలిపారు హరీశ్‌రావు. కేసీఆర్ రెండు పంటలకే రైతుబంధు ఇస్తున్నాడు.. మేం అధికారంలోకి వస్తే మూడు పంటలకు రైతుబంధు ఇస్తామన్న రేవంత్ వ్యాఖ్యలను హరీశ్‌రావు గుర్తు చేశారు. ఇక మంచి డిజైన్లతో ప్రతి ఆడబిడ్డకు రెండు చీరలు పంపిణీ చేస్తామన్న విషయాన్ని కూడా గుర్తు చేశారు హరీశ్‌రావు. ఎల్ఆర్ఎస్ విషయంలో రేవంత్ రెడ్డి మాట మార్చిన తీరును కూడా వివరించారు. ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి పోటీ పరీక్షల విషయంలో రేవంత్ రెడ్డిది డబుల్ స్టాండ్ కాదు.. ట్రిపుల్ స్టాండ్ అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. కుల గణన సర్వేపై రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏం మాట్లాడారో విషయాన్ని హరీశ్‌రావు వివరించారు. ఇక కూల్చివేతల విషయానికి వస్తే.. తెలియక, అమాయకంగా కొనుగోలు చేసిన వారి విషయంలో రెగ్యులరైజ్ చేయొచ్చు కదా అని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాట్లాడిండు.. అధికారంలోకి వచ్చాక కూల్చివేతలపై రేవంత్ రెడ్డి మాట మార్చారని హరీశ్‌రావు మండిపడ్డారు. అధికారం కోసం ఏక్ పోలీసు.. తర్వాత నో పోలీసు అని రేవంత్ అన్నారు. బెల్ట్ షాపుల వల్ల సంసారాలు నాశనం అవుతున్నాయి. ఇప్పుడేమో పల్లెలు తాగాలి.. ఖజానాలు నిండాలనే ధోరణితో విచ్చలవిడిగా బెల్ట్ షాపులకు అనుమతి ఇస్తున్నారని రేవంత్ అరాచకాలపై హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడం, కూలిపోవడం జరిగిపోయిందని రేవంత్ వ్యాఖ్యానిస్తే.. కానీ ఆయన మంత్రివర్గంలో ఉన్న కొండా సురేఖ రంగ నాయక సాగర్ ద్వారా నీళ్లు విడుదల చేసిందని హరీశ్‌రావు గుర్తు చేశారు. టీడీపీలో ఉన్నప్పుడు సోనియా గాంధీ బలి దేవత అని అన్నడు. ఇప్పుడేమో సోనియమ్మ మా అమ్మ.. నాలుగు కోట్ల తెలంగాణ బిడ్డలకు కన్నతల్లి అని అంటుండు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వారిని రాళ్లతో కొట్టి చంపండి అని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అన్నడు.. ఇప్పుడేమో పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నడు. శిలాఫలకాలపై కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అని ఎందుకు రాస్తున్నారు.. తెలంగాణ ముఖ్యమంత్రి అని రాయొచ్చు కదా..? అని ప్రశ్నించాడు. ఇప్పుడేమో ప్రతి శిలాఫలకంపై తన(రేవంత్ రెడ్డి) బొమ్మ వేయించుకుంటున్నాడంటూ హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్ హాయంలో అడ్వైజర్లకు కేబినెట్ హోదా కల్పిస్తే.. ప్రభుత్వ సలహాదారులకు కేబినెట్ హోదాకు వ్యతిరేకంగా కోర్టుల్లో పిటిషన్లు వేసిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడేమో కాంగ్రెస్ ప్రభుత్వంలో అదే సలహాదారులకు కేబినెట్ హోదా కల్పించారని హరీశ్‌రావు గుర్తు చేశారు.

## నన్ను కాల్చి చంపినా నేను పేదల పక్షానే ఉంటా : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

సీఎం రేవంత్ రెడ్డి.. మీరు నా మీద ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, కాల్చి చంపినా నేను నోరు లేని ఈ పేద బిడ్డల పక్షపాతిగానే ఉంటానని బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ గురుకుల బాట చేపట్టిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై రేవంత్ సర్కార్ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డిపై ఆర్ఎస్పీ తీవ్రంగా స్పందించారు. మీ సోషల్ మీడియా లీకులు, మీరిచ్చిన స్క్రిప్ట్ ప్రకారం మతిస్థిమితం లేని మంత్రులు, ఎమ్మెల్యేలు, మరెందరో చిల్లర మూకలు నాపై చేస్తున్న దాడికి నేను బెదరను. మీరేసే తాయిలాలకు గతంలో లొంగలేదు, భవిష్యత్తులో కూడా లొంగను. మీరు స్కూళ్లకు తాళాలు వేసుకుంటెనో, పోలీసులతో మమ్ముల అరెస్టు చేయిస్తేనో మా గురుకుల బాట ఆగుతదనుకుంటే మీ అంత మూరు?లు ఇంకొకరుండరు అని రేవంత్ రెడ్డిపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. ఇక అసలు విషయానికొస్తే.. మీరు ఎందుకు నిజాలను దాచిపెట్టాలని అనుకుంటున్నారో ప్రజలకు చెప్పండి. మీరు చెప్పకపోతే వాటిని చెప్పాల్సిన బాధ్యత మా పిల్లలకోసం మా బీఆర్ఎస్ పార్టీపై ఉంది. మీ బంగళాలో బతికే నలుగురి కోసం నలభై మంది పనిచేయొచ్చు కానీ, మా పేద పిల్లలు చదువుకునే హయత్ నగర్ ప్రతిభా పాఠశాలలో 600 మంది విద్యార్థుల స్కూల్‌ను శుభ్రం చేయడానికి కేవలం ఒకటే ఒక వృద్ధ మహిళను ఎట్ల పెడుతరు..? అదీ ఆమెకు టైంకు జీతాలు ఇవ్వకుండా..? అని ఆర్ఎస్పీ నిలదీశారు. రాష్ట్రంలో అత్యంత ప్రతిభావంతులైన పేద పిల్లలను ఎంట్రన్స్ ద్వారా సెలక్టు చేసి వాళ్లకు




అవసరమైన ఉపాధ్యాయులను ఇవ్వకపోతే వాళ్ల భవిష్యత్ కు భరోసా ఎవ్వరు..? హయత్ నగర్‌లో ఇంటర్మీడియట్‌కు ఇప్పటికీ ఇద్దరు జూనియర్ లెక్చరర్స్ లేరని పిల్లలు కన్నీరు పెట్టుకున్నారు. వాళ్ల పరీక్షలు ఎట్ల పాసైతరు? మీ పిల్లలకు టీచర్లు లేకపోతే మీరు ఊరుకుంటారా? ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పిల్లలు ఇంగ్లీష్ మాట్లాడలేని పరిస్థితి దాపురించిన పరిస్థితిని మీరెట్ల చూస్తరు? అని రేవంత్ రెడ్డిని ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.

# డివైడర్ నుంచి జంప్ చేసిన కారు

మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ నిర్లక్ష్యంగా కారు డ్రైవ్ చేశాడు. ఆటోను తప్పించబోయి వేగంగా డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో గాల్లోకి లేచిన ఆ కారు అవతల రోడ్డులోకి జంప్ చేసింది. ఎదురుగా వస్తున్న స్కూటర్‌ను ఢీకొట్టింది. దానిపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే చనిపోయారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈ సంఘటన జరిగింది. ఆదివారం అర్ధరాత్రి వేళ నరోడా–దేహ్‌గామ్ రోడ్డులో హ్యుందాయ్ క్రెటా కారు వేగంగా ప్రయాణించింది. ముందున్న ఆటోను ఓవర్ టేక్ చేసేందుకు కారు డ్రైవర్ ప్రయత్నించాడు. కాగా, ఆ కారు అదుపుతప్పింది. డివైడర్ పైనుంచి దూకి అవతల రోడ్డులోకి వెళ్లింది. కొన్ని సెకన్లు గాలిలో ఉన్న ఆ కారు ఎదురుగా వస్తున్న స్కూటర్‌ను ఢీకొట్టింది. దానిపై ప్రయాణించిన ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడి మరణించారు. మరోవైపు ఇది చూసి స్థానికులు షాక్ అయ్యారు. వెంటనే కారు వద్దకు వెళ్లారు. కారును ర్యాష్‌గా డ్రైవ్ చేసిన డ్రైవర్ గోపాల్ పటేల్‌ను పట్టుకుని కొట్టారు. ఈ ప్రమాదం గురించి తెలిసి అక్కడకు చేరుకున్న పోలీసులకు అతడ్ని అప్పగించారు. కాగా, కారు డ్రైవర్ గోపాల్ మద్యం



మత్తులో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అతడ్ని అరెస్ట్ చేశారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతులను 26 ఏళ్ల అమిత్ రాథోడ్, 27 ఏళ్ల విశాల్ రాథోడ్‌గా గుర్తించారు. మరోవైపు ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన ఈ సంఘటనకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## వాజేడు ఎస్ఐ హరీశ్ ఆత్మహత్య

మొదటిపేజీ తరువాయి

ఏటూరునాగారం మండలం చెల్పాక–ఐలాపూర్ అటవీ ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టులు, పోలీసులకు మధ్య భీకరపోరు కొనసాగింది. ఇరువర్గాల మధ్య హోరాహోరీగా జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఇందులో ఒకరు మహిళా మావోయిస్టు ఉన్నారు. రెండు ఏకే 47 తుపాకులతోపాటు మరో ఐదు ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో ఆరుగురు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు కాగా, తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామానికి చెందిన ఏగోలపు మల్లయ్య ఉన్నారు. తెల్లవారుజామున 4 నుంచి 5 గంటల సమయంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్టు సమీప గ్రామాల ప్రజలు చెప్తున్నారు. చెల్పాక పంచాయతీ పరిధిలోని పోలుకమ్మ వాగు గొత్తికోయగూడేనికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న దట్టమైన అటవీ ప్రాంతం పుల్లలమెద తోగు సమీపంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ శబరీశ్ పరిశీలించారు. మృతుల్లో నర్సంపేట–ఇల్లందు ఏరియా దళ కమాండర్ కుర్సం మంగు అలియాస్ భద్రు అలియాస్ పాపన్న (35), డివిజన్ కమిటీ సభ్యుడు ఏగోలోపు మల్లయ్య అలియాస్ కోటి (43), ఏరియా కమిటీ సభ్యురాలు ముసకి జమున (23), ఏరియా కమిటీ సభ్యుడు కరుణాకర్ (22) ఉన్నట్టు ములుగు జిల్లా ఎస్పీ శబరీశ్ వెల్లడించారు. మిగిలిన వారిని గుర్తించాల్సి ఉన్నదని చెప్పారు. పీఎల్‌జీఏ వారోత్సవాలకు ఒకరోజు ముందు మావోయిస్టు పార్టీకి తెలంగాణలో భారీ దెబ్బ కోలుకోలేని దెబ్బతగిలింది.

## మహబూబ్‌నగర్ జిల్లాలో పోలిస్ యాక్ట్

మొదటిపేజీ తరువాయి

ధర్నాలు జరుపకూడదని తెలిపారు. నిషేధిత ఆయుధాలైన కత్తులు, చాకులు, కర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు, నేరాలకు పురిగొల్పే ఎలాంటి ఆయుధాలను వాడకూడదని చెప్పారు. భారీగా జనసమూహాన్ని పోగుచేసే సమావేశాలు, లౌడ్ స్పీకర్లు, డీజేలపై కూడా నిషేధం ఉంటుందన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిని చట్టప్రకారం శిక్షిస్తామని తెలిపారు. స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, ప్రజాపాలన అంటూ గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు తెలంగాణను నిర్బంధంలోకి నెడుతున్నది. అధికారంలోకి రాగానే ప్రజాభవన్ వద్ద కంచెలు కూల్చి, ఇకపై ఆంక్షలు ఉండవంటూ హడావుడి చేసిన ప్రభుత్వం.. తాజాగా తన అసలు రంగును బయటపెట్టింది. తమ అసమర్థ పాలనను, వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు పోలీసులను నమ్ముకుంటున్నది. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ యాక్ట్‌ను అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నది. అసంబద్ధ నిర్ణయాలతో రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల సంతోషాలను మింగేసిన కాంగ్రెస్.. ఇప్పుడు ప్రశ్నించే హక్కును కాలరాసేందుకు సిద్ధమైంది. ఇప్పటికే హైదరాబాద్‌లో 144 సెక్షన్ అమలు చేయగా, జిల్లాల్లోనూ పోలీస్ యాక్ట్‌ను విధిస్తున్నది. సంగారెడ్డి జిల్లాలో నవంబర్ మొత్తం పోలీస్ యాక్ట్ అమలు చేశారు. కామారెడ్డి జిల్లాలో గత నెల 7 వరకు పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నది. కాంగ్రెస్ ప్రభు త్వం ఇప్పటివరకు అధికారికంగా 13 జిల్లాల్లో పోలీస్ యాక్ట్‌ను అమలు చేయగా, అనధికారికంగా 20కి పైగా జిల్లాల్లో పోలీస్ యాక్ట్ నిబంధనలను అమలు చేస్తున్నారన్న అనుమానాలు ఉన్నాయి.

## పార్లమెంట్‌లో 'సబర్మతి రిపోర్ట్'ను వీక్షించనున్న ప్రధాని మోదీ

మొదటిపేజీ తరువాయి

సున్నితమైన అంశాన్ని దర్శకుడు చాలా చక్కగా చూపించారన్నాడు. ఒక నాయకుడి గొప్పతనానికి భంగం కలిగించేవిధంగా కొంతమంది వ్యక్తులు కావాలని దీనిని ఆ రోజుల్లో రాజకీయం చేశారని పేర్కొన్నాడు.

ఆ పోస్టుపై ఇటీవల మోదీ స్పందించారు. "కల్పిత కథనాలు పరిమితకాలమే కొనసాగుతాయి. సామాన్యులకు కూడా అర్థమయ్యేరీతిలో వాస్తవాలు వెలుగులోకి వస్తున్నందుకు సంతోషంగా ఉంది" అని పేర్కొన్న ఆయన ఈ సినిమాపై ప్రశంసలు కురిపించారు.

## లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్ని పార్టీల లోక్‌సభాపక్ష నేతలతో భేటీ

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్ని పార్టీల లోక్‌సభాపక్ష నేతలతో సమావేశమయ్యారు. పార్లమెంట్‌లోని లోక్‌సభ స్పీకర్ ఛాంబర్ సమావేశం జరుగుతోంది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమై ఐదు రోజులవుతున్నా ఇప్పటి వరకు ఎలాంటి సభాకార్యకలాపాలు జరగకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివిధ అంశాలపై చర్చకు ప్రతిపక్షాలు పట్టుబట్టడం, స్పీకర్ సభను వాయిదా వేయడం జరుగుతోంది. దాంతో పార్లమెంట్‌లో చర్చ చేపట్టడం ప్రభుత్వానికి ఇష్టం లేదని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈ నేపథ్యంలో స్పీకర్ ఓంబిర్లా అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఈ సమావేశం కొనసాగుతోంది. సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరించాలని ఈ సమావేశంలో ఫ్లోర్ లీడర్లను స్పీకర్ కోరనున్నట్లు సమాచారం. కాగా పార్లమెంట్‌లో గౌతమ్ అదానీ వ్యవహారంపైన, మణిపూర్ అంశంపైన, సంభాల్, అజ్మేర్ ఘటనలపైన, నిరుద్యోగ సమస్యపైన ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. గత ఐదు రోజులుగా ప్రతిపక్షాలు ఇవే అంశాలపై చర్చకు పట్టుబడుతుండగా స్పీకర్ సభను వాయిదా వేస్తూ వస్తున్నారు. ఇవాళ్టి ఫ్లోర్ లీడర్ల సమావేశం తర్వాతనైనా లోక్‌సభ కార్యకలాపాలు సజావుగా సాగుతాయో లేదో చూడాలి.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం,డిసెంబర్ 03, 2024

# అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవం

**– మహిళలపై హింసను అరికట్టాలి , ఐద్వా ప్రధాన కార్యదర్శి వెల్గొండ పద్మ**




**కరపత్రంన్యూస్,ఎండపల్లి** మండలం లోని గుల్లకోట గ్రామం లో జిల్లా పరిషత్ పాఠశాలలో అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా ఐద్వ అల్ ఇండియా డెమోక్రటిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెల్గొండ పద్మ హాజరై మాట్లాడుతూ, మహిళపై హింసను, వివక్షత ను, దాడులను అరికట్టాలి హింసకు వ్యతిరేకం గా ఐద్వ రాష్ట్ర పిలుపు మేరకు అమలు చేస్తూ నవంబర్ 25,నుండి డిసెంబర్ 10 వరకు స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవాలు నిర్వహిస్తున్నామని,మహిళందరు సంఘటితంగా ఉద్యమించాలి అని అన్నారు ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రధానోపాధ్యాయులు రామ్ చంద్రం, మహిళా ఉపాద్యాయ బృందం,డాక్టర్ రక్షిత, మహిళ సంఘాల ప్రతినిధులు,,మంజుల,లత, మహిళా సంఘాల సభ్యులు పాఠశాల అధ్యాపకులు, అంగన్వాడీ ఉపాద్యాయ రాల్లు భూలక్ష్మి, సువర్ణ, పుష్పలత,ఆశా వర్కర్స్, సుజాత, లక్ష్మి, స్వప్న, సుజాత, మహిళలు , తదితరులు పాల్గొన్నారు

# నేడే తెలంగాణ యూత్ డే సదస్సు పోస్టర్ ఆవిష్కరణ.

**కరపత్రం, మెట్ పల్లి, డిసెంబర్ 2..**
తెలంగాణ జన సమితి పార్టీ అనుబంధ సంఘాలు యువ జన సమితి , విద్యార్థి జన సమితి ఆధ్వర్యంలో మలిదశ తెలంగాణ అమరుడు శ్రీకాంతాచారి వర్థంతి సందర్భంగా డిసెంబర్ 3 న బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జరిగే "తెలంగాణ యూత్ డే" సదస్సు గోడ పత్రికను విద్యార్థి జన సమితి జగిత్యాల జిల్లాఅధ్యక్షులు జిల్లపల్లి దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో మెట్పల్లి పట్టణ పట్టణ పార్టీ అధ్యక్షులు పసునూరి శ్రీనివాస్ తో కలిసి మెటపల్లిలో గోడపత్రికలను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా టిఆర్ఎస్ ప్రభుత్వం అమరుల త్యాగాలను మరచి పాలన చేసింది. గత నాలుగు సంవత్సరాలుగా అమరుడు శ్రీకాంత్ ఆచారి వర్ధంతిని యూత్ డిమాండ్స్ డే గా తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో విద్యార్థి జన సమితి , యువజన సమితి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు.ఈ సందర్భంగా నిరుద్యోగుల యువత సమస్య పరిష్కారానికై కొత్త కార్యచరణను , నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాము. కానీ గత బిఆర్ఎస్ ప్రభుత్వం మేము లేవనెత్తిన జాబ్ క్యాలెండర్ ఏర్పాటు రెగ్యులర్గా ఉద్యోగం నోటిఫికేషన్ విడుదల , మేస్ బిల్లుల పెంపు తదితర డిమాండ్లను పట్టించుకోలేదని అన్నారు. కానీ పది నెలల కాంగ్రెస్ ప్రభుత్వం వీటిని పరిష్కరించింది, విద్యార్థుల నిరుద్యోగులపై ప్రత్యేక దృష్టి పెట్టింది. 10 సంవత్సరాల టిఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగాల పేరుతో తెలంగాణ యువతను మోసం చేస్తూ వచ్చిన తరుణంలో శ్రీకాంతాచారి స్ఫూర్తితో యువతలో చైతన్యం వచ్చే దిశగా ముందడుగు వేస్తూ, గత పదేళ్ళలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగులను తయారు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.కానీ ఒక లక్షా యాభైవేల ఉద్యోగాలు భర్తీ చేశామని తప్పుడు ప్రచారం చేసుకుంది. పది నెలల




ప్రజా ప్రభుత్వంలో 50 వేల ఉద్యోగాలను భర్తీ చేసింది. జాబ్ క్యాలెండర్ ద్వారా మరిన్ని నోటిఫికేషన్లను జారీచేస్తుంది. గత బీఆర్ఎస్ పాలనలో ప్రయివేటు, ఐటీ రంగాలలో కూడా తెలంగాణ భూమిపుత్రులకు ఉద్యోగాలు దక్కలేదు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం స్కిల్యూనివర్శిటీని ఏర్పాటు చేసి ఈ రంగాలలో ఉద్యోగ ఉపాధి కల్పన మీద దృష్టి పెట్టింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుద్యోగులు, యువత తరపున కృతజ్ఞత తెలుపుతున్నాం" అన్నారు.
తెలంగాణ రాష్ట్రంలో యువత సమగ్రాభివృద్ధికై ఒక యువజన విధానం రూపొందించాల్సి ఉందని అన్నారు.తెలంగాణ స్థానిక యువకులకే పరిశ్రమలలో మెజారిటీ ఉద్యోగాలు దక్కేలా ఒక ప్రత్యేక చట్టం రావాలని అంటున్నారు .అలాగే, గంజాయి, డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రంగా తెలంగాణనునిర్మించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి జిల్లా నాయకులు చింతకుంట శంకర్ , తెలంగాణ జన సమితి పార్టీ యువ నాయకులు తిరుపతి,రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు...

# ఎన్ టి పి సి అయ్యప్ప దేవాలయంలో అంగరంగ వైభవంగా పడిపూజ మహోత్సవం

**– ముఖ్య అతిథిగా ఎన్ టి పి సి సథరన్ రీజియన్ ఆర్ ఈ డి శ్రీ కేదార్ రంజన్ పాండు గారు పాల్గొన్నారు**

**కరపత్రం రామగుండం డిసెంబర్, 02:**
ఆదివారం ఎన్ టి పి సి పి టి ఎస్, వైకుంఠపురం హరిహర దేవాలయం ప్రాంగణంలోని శ్రీఅయ్యప్ప స్వామి వారి దేవాలయంలో అంగరంగ వైభవంగా, అత్యంత భక్తి శ్రద్ధలతో ఐ సి హెచ్ కార్తికేయన్ మరియు వారి బృందం నిర్వహించిన పడి పూజలను ఆలయ పూజారి భ్రహ్మశ్రీ రాంపల్లి వామనశర్మ గారి చేతుల మీదుగా ఘనంగా జరిగాయి అని అఖిలభారతీయ అయ్యప్ప ధర్మాప్రచార సభ (ఏ బి ఏ పి ) సభ్యుడు జనగామ తిరుపతి తెలిపారు . కాగా ఈ కార్యక్రమాని ముఖ్య అతిధిగా ఎన్ టి పి సి ఆర్ ఈ డి శ్రీ కేదార్ రంజన్ పాండు, అన్ని విభాగాల జి ఎం లు, హెచ్ ఆర్ ఏ జి ఎం బజయ్ కుమార్ సిగ్దార్ తో పాటు ఏ జి ఎం లు, డి జి ఎం లు, అధికారులు పాల్గొని



ప్రత్యేక పూజలు చేశారు అన్నారు. ఉదయం గణపతి హోమం, మరియు అయ్యప్ప స్వామికి, అన్ని ఉత్సవ విగ్రహాలకు అభిశేఖం చేసినట్లు తెలిపారు. సాయంత్రం దేవాలయ ప్రాంగనం దీపారదన, కళశపూజ , భక్తి పారావస్యంతో భజన, అయ్యప్ప శరణుగోషతో వైకుంఠపురం ప్రాంగణం మారుమోగింది అని పి టి ఎస్ అయ్యప్ప దేవాలయమునకు పూర్వ వైభవం వచ్చింది అని పలువురు గురుస్వాములు హర్షం వ్యక్తం చేస్తు ఆలయ ఇంచార్జి పొలినేని సంపత్ రావు ని అభినందించారు అని అన్నారు. అనంతరం పడిపూజ, అల్పాహారం, ప్రసాద వితరణ జరిగింది అని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ్యుడు జనగామ తిరుపతి తెలిపారు. అయ్యప్ప దేవాలయం కమిటీ సభ్యుడు పోలినేని సంపత్ రావు ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాలలో , కార్పొరేటర్ కొలిపాక సుజాత మల్లయ్య, హరి హర దేవాలయ కమిటీ చైర్మన్ చెంద్రశేఖర్, సభ్యులు వి. గిరి కుమార్, టి వి ఆర్ చంద్ర, ప్రభాకర్ గురు స్వామి, రాములు గౌడ్ గురు స్వామి, శేషు కుమార్ గురు స్వామి, బజన బృందం సాగి కిషన్ రావు, కేరళ హరి, కృష్ణ,పర్స రామస్వామి గురుస్వామి మరియు అయ్యప్ప కన్నె స్వాములు, గురు స్వాములు మరియు భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# చిట్టాపూర్ లో దొంగల బీభత్సం



**కరపత్రం డిసెంబర్ 02**
చిట్టాపూర్ గ్రామంలోని మార్కండేయ ఆలయంలో పూజారిగా విధులు నిర్వహిస్తున్న బుక్కరాజేశం ఇంట్లో దొంగలు పడి దోచుకున్నారు వివరాల్లోకి వెళితే చిట్టాపూర్ గ్రామానికి చెందిన బుక్కరాజేశం తన వ్యక్తిగత పనులు నిమిత్తం గత నెల 28వ తారీఖున వరంగల్ వెళ్ళాడు వెళ్లిన రాజేశం ఈరోజు తిరిగి వచ్చాడు వచ్చేసరికి తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న బెడ్రూంలో వస్తువులు చిందర వందర చేసి బీరువాలో ఉన్న పదివేల రూపాయల నగదు దోసుకెళ్లారు ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానిక మల్లాపూర్ ఎస్సై కిరణ్ కుమార్ గౌడ్ క్లూస్ టీం సహాయంతో ఇంటి పరిసరాలను నిశితంగా పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు

# ప్రభుత్వ న్యాయవాదిని కలిసిన మాజీ సింగిల్ విండో చైర్మన్

**కరపత్రం వనపర్తి ప్రతినిధి:**
న్యాయవాద వృత్తిలో దేవరాజు.కిరణ్ కుమార్ నిబద్ధతను చాటుతూ అంచలంచేలుగా ఎదిగారని నాగవరం మాజీ సింగిల్ విండో చైర్మన్ సహదేవ్ అన్నారు.వనపర్తి జిల్లా కోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా పదవీ బాధ్యతలు చేపట్టిన కిరణ్ కుమార్ ను సోమవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.సహదేవ్ మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో నిబద్ధతను చాటుతూ ఇతరులకు మార్గదర్శకంగా నిలిచారని అన్నారు.



# పెండింగ్ బిల్లులు, డీ ఏ లు మంజూరు చేయాలి

**– ఎస్టియుటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మాడుగుల పర్వత్ రెడ్డి**

**కరపత్రం న్యూస్ కరీంనగర్,:::: డిసెంబర్ 2**
ఉపాధ్యాయులకు సంబంధించి దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న బిల్లులను సత్వరం మంజూరు చేసి వారి ఖాతాలకు జమ చేయాలని ఎస్టిటీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మాడుగుల పర్వత రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం మంకమ్మతోటలోని టీఎస్జీవో భవన్లో జరిగిన ఎస్టీయూ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిపిఎఫ్ , టిఎస్జిఎల్ఐ ,మెడికల్ రియంబర్స్మెంట్, సప్లిమెంటరీ బిల్లులు , మెడికల్ బిల్లులకు సంబంధించి లక్షలాది రూపాయలు ఈ కుబేర్ లో నిలిచిపోయాయని వాటిని సత్వరం మంజూరు




చేయాలని కోరారు. ఉపాధ్యాయుల సొమ్ము ఉపాధ్యాయుల అవసరాలకు అందుబాటులో లేకుండా పోతుందని వాపోయారు. మిగిలిపోయిన నాలుగు డీ ఏ లను వెంటనే మంజూరు చేయాలని, మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా స్థానికత కోల్పోయిన ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన బిల్లులు ప్రతినెలా చెల్లించాలని. మధ్యాహ్న భోజన పథకం అమలుకు పాఠశాలల్లో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధ్యాయుల, ఉద్యోగుల మెరుగైన వైద్య చికిత్సకు ప్రణాళికలను రూపొందించి అమలుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి ఆర్ శ్రీనివాస్, కట్టా రవీంద్రాచారి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి డాక్టర్ ఆట సదయ్య, రాష్ట్ర బాధ్యులు పిన్నింటి తిరుపతిరావు, శనిగెరపు రవి, సాన కిషన్, కందుకూరి దయానంద్, దాసరి శ్రీధర్, వెలిచాల వెంకటస్వామి, కొట్టే లక్ష్మణరావు సీనియర్ నాయకులు మహాదేవుని నారాయణస్వామి జిల్లా ఆర్థిక కార్యదర్శి గుండ శ్రీనివాస్, జిల్లా నాయకులు యెనగంటి బాలాజీ, కోట శ్యామ్ కుమార్, నాం పవన్, సమ్మయ్య, తాటిపాముల శ్రీనివాస్, సంజీవ చారి, గోలి సతీష్, కిషన్ రావు, రాజేందర్ రెడ్డి, మాధవ స్వామి, నాగరాజ్, సమ్మయ్య, లక్ష్మణాచారి, దాసరి సుభాష్, కందుకూరి శ్రీనివాస్, రాజు, శ్రీనివాస్ రెడ్డి, చొప్పదండి రామకృష్ణ , సంజీవ్ తదితరులతోపాటు మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

# దుబాయిలోచలికాలంలో పొంచివున్న వ్యాధుల గురించి అవగాహన కార్యక్రమం.

..ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షులు రాజా గౌడ్ .

**కరపత్రం మెట్ పల్లి, డిసెంబర్ 2.**
చలికాలంలో పొంచి ఉన్న వ్యాధుల గురించి ప్రభాస్ మిత్ర లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో దుబాయిలో అవగాహన కార్యక్రమం జరిగినట్లు ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షులు బత్తిని రాజా గౌడ్ తెలిపారు.దగ్గు, జలుబు, గొంతునొప్పి, తీవ్రత ఎక్కువగా ఉన్నవారికి ఆయాసం, న్యూమోనియా వంటి లక్షణాలు కనిపిస్తాయని అన్నారు.చలి ఎక్కువగా ఉన్న సమయాల్లో మాస్కులు ధరించాలి. దీంతో వైరస్ సోకదు. వేరేవారికి సోకకుండా ఉంటుందని వివరించారు. చలిగాలుల్లో ఆరు బయట పనిచేసే గల్ఫ్ కార్మికులు, జాగ్రత్తగా ఉండాలి అని ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ యూఏఈ దుబాయ్ అధ్యక్షులు బత్తిని రాజా గౌడ్ అన్నారు. అయితే ఇప్పుడు గల్ఫ్ లొ చల్లటి వాతావరణం ఉన్నది కావున మనం పని చేస్తున్న సమయం లో హెల్త్ పై శ్రద్ధ అవసరం మనం భద్రతగా పని చేస్తు వుడలి, ముఖ్యంగా గ్లోవ్స్, మాస్క్,హ్యాండ్ సంటైజర్. సెఫ్టీ బెల్టు, సేఫ్టీ సూ, సేఫ్టీ గోగులు, సేఫ్టీ జాకేటు,వీటిని అనుసరిస్తూ ప్రతిదినమూ మనపని మణం చేసుకోవాలని తెలిపారు.ఆదేవిధంగా ఆరోగ్యం పై శ్రద్ధ అవసరం అని. ఈ మధ్య అనారోగ్యం గురుఆయిన కార్మికులు పాలు, సమస్యలను ,ప్రవాస మిత్ర లేబర్ యూనియన్ దృష్టికి తీసుకువచ్చారు, ఈ కార్యక్రమాల్లో నారాయణ, రమేష్, ప్రశత్, శ్రీనివాస్ కార్మికులు పాల్గొన్నారు.



# మున్నూరు కాపు సంఘం ఆద్వర్యంలో కూన గోవర్దన్ కు సన్మానం.

**....సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న సుజిత్ రావు.**

**కరపత్రం ప్రతినిధి,మెట్ పల్లి, డిసెంబర్ 2.**
జగిత్యాల జిల్లా మెట్పల్లి పట్టణంలోని మున్నూరు కాపు (రామ్ నగర్) సంఘం ఆద్వర్యంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన కూన గోవర్ధన్ ను ఘనంగా సన్మానించారు.సోమవారం పట్టణంలోని క్లబ్ లో నిర్వహించిన సంఘ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, టీపీసీసీ డెలిగేట్ మెంబర్ కల్వకుంట్ల సుజీత్ రావు లను పూలమాలలు ,శాలువా తో సన్మానించారు. మున్నూరు కాపు అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని కూన గోవర్ధన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అద్యక్షుడు మాసుల ప్రవీణ్, బొడ్ల రాజేష్, బెజ్జంకీ నవీన్, కృష్ణ బాబు, ఒద్యటి వేణు గోపాల్, సంగు సంజీవ్, దోమకొండ రమేష్, ఆగ సురేష్, చౌడరాపు సంజీవ్, అందె మారుతీ, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**–జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి**

**కరపత్రం సంగారెడ్డి ప్రతినిధి**
ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 43 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, డీఆర్ఓ పద్మజ రాణి లకు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ధరఖాస్తులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



